# అబ్బాయే కావాలా?

(గతసంచిక తరువాయి)

ఆలోచనల ఆవలిటంచుకు అడుగెట్టిన కుటుంబరావు మెదడులో నరాలు తెగుతున్నట్లు వినిపించింది. రక్తం మెదడుకు ఎగ్రాకి ముఖమంతా ఎర్రగడ్డలా తయారయింది. "నో నో! నా జీవితం కాని. శంకరం జీవితం కాని అలా కాకూడదు" అంటూ బల్ల గుద్దుతున్నాడు.

మిత్రులందరూ చుట్టూరాజేరి అతని భుజాలు పట్టుకుని కుదుపుతుంటే— ఈ లోకంలోపడి జరిగింది తెలుసుకుని సిగ్గుపడి ఛీ! ఏమిటీ పిరికి ఆలోచనలు అనుకుని "ఆఁ ఏంలేదురా! వున్నట్టుండి విపరీతమైన తలపోటు వచ్చింది. అప్పుడప్పుడు యిలా వస్తుంది" అని తెలివిగా సర్ది చెప్పుకుని. మంచినీళ్ళు త్రాగి బయటపడ్డాడు.

* * *

ఈజీ ఛైర్‌లో మేనువాల్చి విశ్రాంతి తీసుకుంటున్న శంకరానికి అచ్యుతమ్మగారు కాఫీ యిస్తూ "ఏరా! ఉత్తరం వచ్చిందా? బాలసార విషయం ఏమన్నా వ్రాశారా?" అంది.

"యివ్వాళే వచ్చింది ఉత్తరం. మొదటి పిల్లకు యిక్కడే చేసుకున్నారు కాబట్టి ఈ దఫా మేము అక్కడ చేసుకుంటాం" అని వ్రాశారు.

"నువ్వేమన్నావ్"

"ఏమనేదేముంది. సరే అన్నాను. బాలసారె అయిన వెంటనే పార్వతిని తీసుకువెడతానని వ్రాశాను"

తండ్రి ఆరోగ్యం సరిగా లేకపోవటం వలన తల్లిదండ్రులు. ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ వలన అన్నగారు. ఆడబడుచు పెళ్ళి కారణంగా పెద్దక్క బాలసారెకు వెళ్ళలేకపోయారు. బాలసారె పూర్తయ్యాక శంకరం ఒక్కడే యింటికి తిరిగివచ్చాడు. కోడలిని తీసుకురాకుండా వచ్చిన శంకరాన్ని ఏమీ అనలేక తనలోతానే గొణుక్కుంది అచ్యుతమ్మగారు.

ఒక వారం గడిచింది. శంకరం మిత్రులందర్నీ ఆదివారం తన యింట్లో జరిగే పార్టీకి రమ్మని ఆహ్వానించాడు.

ఆదివారం మధ్యాహ్నం నుండే మధ్య హాలులో యింట్లో కుర్చీలేకాక– చుట్టుపక్కల యిళ్ళల్లో వాళ్ళందరివి పోగేసి నీట్‌గా సర్దాడు. స్నేహితులకు పార్టీ యిచ్చే వుద్దేశ్యంతో కావలసిన స్వీటు-హాటు కొని తెచ్చి పెట్టాడు. స్నేహితులు వస్తే రిసీవ్ చేసుకోమని ఇంట్లో వాళ్ళకి చెప్పి తాను ఆరుగంటలకు వస్తానని చెప్పి వూళ్ళోనే వాళ్ళ పెద్దమ్మ కూతురింటికి వెళ్ళాడు.

అయిదు గంటలనుండి స్నేహితులు ఒకళ్ళ తరువాత ఒకళ్ళు రావడం మొదలెట్టారు. వచ్చినవాళ్ళు అందరూ టిఫిన్ చేస్తున్నారు.

"ఏరా! యింతకీ మనల్ని పిలిచి శంకరం కనిపించడం లేదేమిటి? ఎటు వెళ్ళినట్లు? ఏమండీ! శంకరం ఎక్కడికి వెళ్ళాడు" అంటూ అడిగాడు సుబ్బారావు.

"యిప్పుడే వస్తానంటూ వెళ్ళాడు బాబూ" అని చెప్పారు అచ్యుతమ్మగారు.

బయట ఆటో శబ్దం అవటంతో అందరు అటుతిరిగి చూశారు. శంకరం భార్యా పిల్లలతో ఆటో దిగాడు. కొత్త మేనకోడల్ని చూడటానికి పరుగు పరుగున వచ్చిన శంకరం చెల్లెలు వదినగార్ని తోడ్కొని లోపలికి తీసుకు వెళ్ళింది.

ఆలస్యంగా వచ్చినందుకు మిత్రులకు సారీ చెప్పుకున్నాడు. అందరూ రెండవ తడవ కాఫీలు తాగుతుండగా "ఏరా సుబ్బిగా! ఆడపిల్ల పుట్టింది కదా నాకు. అసలు నీకు ఆడపిల్లలంటే ఎందుకురా ఎలర్జీ" అడిగాడు శంకరం. కాఫీ తాగుతున్న సుబ్బారావు ఆడపిల్ల అంటూ హేళనగా మాట్లాడాడే తప్ప అలా ఎందుకు మాట్లాడాడో చెప్పలేకపోయాడు.

"ఏరా! అప్పిగా నువ్వేమంటావ్"

కాసేపు ఆలోచించి "అంతా బడ్జెట్‌కి డెబిట్‌కాని క్రెడిట్ లేదు" అన్నాడు అప్పారావు.

"ఏరా సోమలింగం! నువ్వేమంటావ్?" అడిగాడు శంకరం.

"నేనేమంటాను ఎవరైనా ఒకటే" అన్నాడు సోమలింగం పార్టీ మారుస్తూ.

"ఏరా! నీకు నలభై ఏళ్ళు వచ్చాయనుకో ఇరవై సంవత్సరాల కూతురుంది. ఇరవై రెండు సంవత్సరాల కొడుకున్నాడు నువ్వు తిరిగి తిరిగి యింటికొచ్చావు. నీకు కాళ్ళు కడుక్కోనేందుకు నీళ్ళెవరిస్తారు, కొడుకా? కూతురా?"

"కూతురే" అన్నాడు సుబ్బారావు.

"మీ ఆవిడకు ఒంట్లో బాగోలేనపుడు వంట చేసేదెవరు?"

"కూతురే" అన్నాడు సోమలింగం.

"బట్టలుతికేదెవరు?"


"కూతురే"

"ఏరా! యింతవరకు నేనడిగిన ప్రశ్నలన్నింటికి సమాధానం కూతురే అని చెప్పారు. ఒక్కరుకూడా 'కొడుకు' అని అన్లేదేరా?"

యికపోతే బడ్జెట్ విషయం. తమ్ముడ్ని పిలిచి అందరికి తలో కాయితం. పెన్నో. పెన్సిలో యిచ్చాడు.

"రాయండి చెబుతాను. రెండు సపరేట్ కాలమ్స్ వేసి ఒక సైడు కొడుకు. ఒక సైడు కూతురు. వాళ్ళ ఖర్చులు వ్రాయండి. పుట్టిన దగ్గర్నుంచి అయిదు సంవత్సరాలు వచ్చేవరకు యిద్దర్లో ఎవరైనా ఖర్చులు మామూలే. అయిదు సంవత్సరాల నుంచి పది సంవత్సరాల వరకు కూడా కొడుకు ఖర్చులు ఎక్కువ. ఎలాగో చెప్తా వినండి. కూతురికి ఒక గౌను కొంటే కొడుక్కి నిక్కరు. చొక్కా కొనాలి. ఏది ఎక్కువ. గౌను ఖరీదు పదిహేను రూపాయలైతే. లాగు. చొక్కా పాతిక రూపాయలు. సంవత్సరానికి పది జతలు అనుకోండి అంటే కూతురికి నూటయాభై రూపాయలు, కొడుక్కి రెండువందల యాభై రూపాయలు అవుతుందన్నమాట. అలాగే అయిదు సంవత్సరాలకి లెక్కగట్టి రాయండి. అందరు రాశారా?

దనవహి రామానంద్



పదకొండు సంవత్సరాలనుంచి పదమూడు సంవత్సరాల వరకు యిద్దరి ఖర్చుల్లో పెద్ద తేడా వుండదు. ఎందుకంటే స్కర్టు-జాకెట్టు ఆడపిల్లకి, లాగు-చొక్కా వీడికి. కాబట్టి ఖర్చు సమానం. ఈ మూడు సంవత్సరాలు లెక్కలోకి తీసుకోనవసరంలేదు. ఇక పద్నాలుగు సంవత్సరాలనుంచి ఇరవై సంవత్సరాల వరకు పరికిణీ-ఓణీ- జాకెట్ పిల్లకి. ఫాంటు షర్టు వీడికి. అంటే యింతవరకు నిక్కర్లు వేసే కుర్రాడు పాంటు వేసాడు. కుట్టుకూలీలు మండిపోతున్నాయి కాబట్టి ఆమెకంటె కొంచెం వీడికే ఖర్చు ఎక్కువ. అంటే సంవత్సరానికి ఆడపిల్లకి అయిదువందల రూపాయలైతే, వీడికి ఏడువందల యాభై అవుతుందన్న మాట. అలా ఏడు సంవత్సరాలకు లెక్కకట్టి వేయండి. యిక రింగులు, రిబ్బన్లూ, గాజులు ఆడవాళ్ళకి. ఫ్రెండ్సూ, సిగరెట్లు, సినిమాలు, అలవాట్లు వీడికి. ఆడపిల్లకయ్యే ఖర్చు

కన్నా యివి ఎక్కువే. యిక పెళ్ళిళ్ళ వేట. అమ్మాయికి కట్నం వేలలో వుంటుంది కాబట్టి ఖర్చు కనిపిస్తుంది. మరి వీడికి చవకగా ఉద్యోగం వస్తుందా? వేలుపోసి చదివించాలి. ఉద్యోగం కోసం లంచం తినిపించాలి. ఎందరికి తినిపించాలి. ఎంత తినిపించాలి అనేది వాడికి దొరికే ఉద్యోగాన్నిబట్టి వుంటుంది. తీరా వుద్యోగం వచ్చాక మనల్ని ఉద్ధరిస్తాడా? పెళ్ళి చేసుకుని వేరింటి కాపురం పెడతాడు.

యిప్పుడు చెప్పండి. కూతుర్ని కొడుకులతోపాటు చదివించినప్పటికి ఈ ఖర్చు. యిప్పుడదంతా కూడి ఖర్చు ఎవరిది ఎక్కువో చెప్పండి" అన్నాడు శంకరం.

"కొడుకుదే" అన్నారు అందరూ ముక్త కంఠంతో.

"కూతుర్ని చదివించకపోతే ఖర్చు ఎవరిదెక్కువరా సుబ్బిగా!" అని అడిగాడు శంకరం.

"కొడుకుదే" అన్నాడు సుబ్బారావు.

"అయితే బడ్జెట్ ఎవరిది క్రెడిట్. ఎవరిది డెబిట్" అడిగాడు శంకరం.

మూగబోయారు మిత్రులందరూ.

> **అర్థమైంది**
>
> "నాన్నా! నీ వెంట్రుకలు కొన్ని ఎందుకు తెల్లగయ్యాయి?"
>
> "నీవు అబద్ధం ఆడినప్పుడల్లా నాఓ వెంట్రుక తెల్లగౌతుంది"
>
> "తాతగారి వెంట్రుకలన్నీ ఎందుకు తెల్లగయ్యాయో ఇప్పుడర్థమైంది"
>
> -చాగాపురం నాగేశ్వరరావు.
> (గద్వాల)

"ఎన్నుకున్నా సూపర్ బ్రెయిన్‌రా మన శంకరానిది" అని, "నీ ముద్దుల రాకుమారిని చూపిస్తే వెళ్ళొస్తామోయ్" అన్నారు లేవడానికి సిద్ధపడుతూ.

"పార్వతీ! బేబీని యిటు తీసుకురా" అని కేక పెట్టాడు శంకరం.

బేబీని గిల్లి ముద్దు పెట్టుకుని. తెచ్చిన బొమ్మలు పాపకు చూపించి పెద్దయిన తరువాత ఆడుకోమ్మా అన్నట్లు టేబుల్‌పై పెట్టారు.

"బేబీ అదృష్టవంతురాలురా. తండ్రి పోలికలు బాగా వున్నాయి" అన్నాడు పాక్షి ఫిరాయించిన పోషులింగం.

బేబీని నిలువునా ఎత్తి తన ముఖంపైకి పెట్టి చూస్తున్నాడు అప్పారావు. ఇంతలో అప్పారావు ముఖాన్ని బేబీ అభిషేకించింది. మనసులో తిట్టుకుంటూ "ఛ ఛ" అన్నాడు అప్పారావు చిరునవ్వు ఎరువు తెచ్చుకుని.

బేబేని క్రిందకు దింపి. తడిసిపోయిన బేబీ అండర్‌వేర్ విప్పాడు శంకరం.

అందరూ ఆశ్చర్యపోయారు.

"ఇదేంటిరా! ఆడపిల్లని చెప్పి అందర్నీ ఫూల్స్ చేసావు" అన్నాడు ముందుగా తేరుకున్న సుబ్బిగాడు- పాలిపోయిన ముఖంతో.

అక్కడేవున్న అచ్యుతమ్మగారు ముందు కోడల్నీ, తరువాత కొడుకునీ కోపంగా చూసి మనవడే అయినందుకు గర్వంతో ముసిముసిగా నవ్వుకుంది.

"ఏం లేదురా! మొదటగా మొగపిల్లాడు పుట్టాడని చెబితే మీ అందరి దిష్టి వాడికి తగులుతుందని- అందర్నీఏడిపించే మిమ్మల్ని కసిదీరా ఏడిపించాలని నేనే ఓ చిన్న నాటకం ఆడా" అన్నాడు శంకరం పగలబడి నవ్వుతూ. ●




నింగి నేలకు
గిలిగింతలు పెడుతున్న చోట
నువ్వూ నేనూ-
నా ఊహల్లో
నెమలిపాట, కోకిల ఆట-
ఈర్ష్యతో ఎరుపెక్కిన చిగుళ్ళు
కుళ్ళుగా మరగలైతే సెలయేళ్ళు-
నా మనసు నీ మనసుతో లేచిపోయి
కలల్లో కాపురం చేసేది-
నువ్వు తొక్కిన గరికలన్నీ ఏరి
మాలగా సిగలో తురిమానా-
మందారం మొహం మాడ్చుకునేది
రోజా సిగ్గుతో వాడిపోయేది-
ఏంలాభం-
మనం అనుకున్న జీవితం
నేస్తుగానే మిగిల్చావే-
నా హృదయం సముద్రమన్నావ్
అందుకేనేమో-
అందులోనే ముంచి చంపేసావ్
గరిక తురిమిననాడు తెలీలేదు
నాకునేనే గడ్డి పెట్టుకుంటున్నానని-
ప్రేమ పారిజాతమన్నావ్
గగన కుసుమమని నాకేం తెలుసు-
తల్లీ
నేనో గుండెలేని మనిషిని
పగిలిపోయి చెరచబడిన
మాంసపు ముద్దైనా మీక్కనపడితే
నాకు అందివ్వరూ-
అది నా మనసు